


# "స్వయంకృతం"

సర్వర్ తెచ్చిన కాఫీకప్పులు అందుకున్నారు సత్యం, చలపతి.

"ఆడవాళ్లకి కూడా మనలాగానే కోరిక లుండటం సహజం. ధైర్యంచేసి ప్రయత్నించిన మగవాడికిలొంగనిఆడదంటూవుండదు!" అన్నాడు మనస్తత్వశాస్త్రాన్ని మథించి సత్యం చెప్తున్నట్టు—చలపతి.

అతను అంత కష్టపడి చెప్పినమాటల్ని ఒక నవ్వుతో తీసిపారేశాడు సత్యం!

"'నిజానికి' అయిదారు మైళ్ళ దూరంలో వున్నావు చలపతీ — ఆడవాళ్ళని నువ్వంత తేలికచూపు చూడటం నాకు నచ్చలేదు!" అనేశాడు.

"నీకు నచ్చటం—నచ్చకపోవటంతో నాకు నిమిత్తంలేదు. ఉన్న నిజం చెబితే ఎవరికయినా ఉలుకెక్కువ. గెలీలియో అంతటివాడిని పిచ్చివాడికింద కట్టారు — 'భూమి గుండ్రంగావుంది' అన్నందుకు!"

"నాకు ఋజువుచేసి చూపించగలవా — నీమాటలు? నేనొక మనిషిని చూపిస్తాను!" అన్నాడు హుషారుగా సిగిరెట్టు ముట్టించి.

"నాలో ఆడవాళ్లని సమ్మోహపరిచేటంత అందంలేదు—అయినా ప్రయత్నిస్తాను. నా మాటలు నీకు ఋజువు చేయగలననే నా నమ్మకం!"

ఒక్కనిమిషం ఎవరూ మాట్లాడలేదు. చివరికి సత్యం—

"మా యింటి పైవీధిలో రేఖాదేవి వుంది తెలుసుగా! స్కూల్లో పంతులమ్మపనిచేస్తోంది. ఆవిడ చాలా మంచిదని — ఎవరినీ తలెత్తి చూడదని, పన్నెత్తి పలకరించదని ప్రతీతి! ఇదివరలో చాలామంది ఆవిడ చిరునవ్వుకోసం ప్రయత్నించి భంగపడ్డారు! ఆవిడవిషయంలో ఎంత ప్రయత్నించినా నీమాటలు వ్యర్థమైపోతాయని నా నమ్మకం!" అన్నాడు.

తేలిగ్గా, హాయిగా నవ్వేశాడు చలపతి.

"ఇటువంటిరేఖల్ని చాలామందిని చూశాం బ్రదర్! ఆల్ రైట్, చూద్దువుగానిగా!" అంటూ లేచాడు.

ఇద్దరూ చేతులుకలుపుకుని విడిపోయారు.

* * *

చలపతి, సత్యం చిన్నప్పటినుంచి 'లా' పాసయేదాకా క్లాస్‌మేట్సు. ఒకేవూరిలో ప్రాక్టీసు పెట్టారు. వెనక ఆస్తి ఉండటంవల్లను, ప్రస్తుతము కేసులు లేకపోవడంవల్లను, ఇద్దరికీ తీరుబాటు యెక్కువ.

రచన:

సింగరాజు రామచంద్రమూర్తి

చలపతికి పెళ్లయి కాపరంపెట్టినా—విద్యార్థి దశలోని అలవాట్లు పోలేదు! బ్రహ్మచారిగా వున్న సత్యం విషయం సరేసరి!

సత్యంతో అన్నాడన్నమాటే గాని — అన్నమాట నిలబెట్టుకోగలనన్న నమ్మకం చలపతికీ లేదు.

రేఖాదేవి చాలా అందమయిన మనిషి దర్జాగా వుంటుంది. ఎవరితోనూ అట్టే మాట్లాడినట్టు కనబడదు. అటువంటిది తనతో మాట్లాడుతుందని నమ్మకం ఏముంది?

* * *

ఆ రోజు ఆదివారం. మధ్యాహ్నంపూట హిందిపిక్చరు మ్యాటినీకి బయలుదేరాడు.

హాల్లోకి వెళ్లేసరికి పిక్చరు మొదలుపెట్టేశారు. బయట మంచి ఎండలోంచి రావటం వలన కళ్లు కనబడటంలేదు. పైగా హాలంతా నిండిపోయింది. తడుముకుంటూ కూర్చున్న వాళ్ళకాళ్ళు తొక్కుకుంటూ—వాళ్ళకి తలొక 'సారి' అందజేస్తు వెళ్ళి ఖాళీగా కనబడిన మొదటి కుర్చీలో కూలబడ్డాడు. చీకటికి కళ్లు అలవాటుబడినాక చూస్తే — తన పక్కన కూర్చున్నది రేఖాదేవి! వెదకబోయిన లత చేతికి తగిలింది!

ఇంటర్వల్‌లో లైట్లు వెలిగాయి.

"నమస్తే! మీపేరు రేఖాదేవి కదూ!" అన్నాడు ధైర్యంగా.

"అవును" అని క్లుప్తంగా అని ఎందుకన్నట్టు చూసింది.

"మొన్న మీ స్కూల్లో వేసిన ప్రోగ్రామ్స్ చూశానండి! మా జడ్జిగారు నేను వచ్చాంలెండి"—

ఏమిటి ఈ వాగుడన్నట్లు ముఖం అందముగా చిట్లించింది.

కాని చలపతి జంకకుండా, "అన్ని కార్యక్రమాలు ఒక ఎత్తు — మీరు డైరెక్టుచేసిన పిల్లలడ్రామా ఒక ఎత్తు! అడుగడుగునా—మీ ప్రతిభ కనబడింది అందులో. జడ్జిగారు కూడా ఎంతో ఇదయారు. రాసింది కూడా మీరే ననుకుంటా!" అన్నాడు.

ఆమె కోటిమల్లెలు విచ్చుకున్నట్టు నవ్వింది చిన్నగా మెత్తగా. అంతలోనే సిగ్గుపడిపోతూ "ఆఁ, ఏదోలెండి! మీరనేటంత గొప్పగా లేదులెండి" అంది.

"ఇన్సల్ట్ — ఏమండోయ్! పోనీ నన్ను వెధవకింద కట్టేయండి! మా జడ్జిగారి నేమం

టారు? ఆయన తెగపొగిడారు. చాలా బాగుందనుకోండి!" అంటూనే రెండు డ్రింకులందుకుని ఒకటి రేఖాదేవికిచ్చి "మీరు కాదంటే నా మనస్సుకి కష్టంగావుంటుంది" అనేశాడు.

తరువాతి సినిమా యిద్దరూ చూడలేదు. సారస్వతాలు, కథలు, నాటకాలు చర్చలో పడిపోయారు.

సినిమా అయిపోయాక "ఆటోరిక్షాలో పోదాం రండి! మిమ్మల్ని ఇంటిదగ్గర 'డ్రాప్' చేస్తాను" అన్నాడు.

కాదనకుండా ఒప్పుకుంది. విడిపోయే ముందు "మీరు చాలా తమాషాగా మాట్లాడుతారు—రేపు ఆదివారం 'టీ'కి రావాలి తప్పకుండా! రాకపోతే నా మనస్సుకి కష్టంగా వుంటుంది" అంటూ నవ్వింది రేఖాదేవి.

గాలిలో తేలిపోయాడు చలపతి! ఆమె మాట, నవ్వు, ఒంపులు అతన్ని గిలిగింతలు పెట్టాయి. ఆటోలో మలుపుతిరిగేప్పుడు అతని మీదికి ఒరిగిపోయినపుడు శరీరపుమెత్తదనము వెచ్చదనమూ మరిచిపోలేకపోయాడు. కేవలం పందెంకోసం తనే అవస్థపడుతున్నా నన్న మాట యెప్పుడో మరిచిపోయాడు!

ఆదివారం గంటసేపు మేకప్ అయాడు. 'ఎక్కడికి' అని అడుగుతుందేమో కమల అనుకున్నాడుగాని, అడక్కపోవడంతో హుషారుగా బయటపడ్డాడు.

గుమ్మంలోనే చిరునవ్వుతో ఎదురయింది రేఖాదేవి. ఆమె అందం అతనికి మతి పోగొట్టింది.

"మీరు రారేమో అని దిగులుపడుతున్నానండి" అంది.

"ఎంతమాట—మీరు స్వయంగా పిలిచాక ప్రవరాఖ్యుడినా ఏమిటి రాకపోవటానికి" అనేసి ఆమెకి ఎక్కడ కోపం వస్తుందోనని ఆమెవంక చూశాడు.

ఫక్కున నవ్వేసి "అయితే మనుచరిత్ర చదివారన్నమాట. రండి టీ చల్లారిపోతుంది" అంటూ లోపలికి దారితీసింది.

స్వయంగా కలిపి తనే అతనిచేతికి అందించింది. కావాలని ఆమెచేయి తాకుతూ అందుకున్నాడు. ఏమీ జరగనట్టే ఊరుకుంది.

చలపతికి ఆమెమాటలు, చేతలు చాలా ప్రోత్సాహకరంగా కనబడ్డాయి. ధైర్యంచేయాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో ఎవరూ ఉన్నట్లు తోచలేదుకూడా?

"మీయిల్లు చూపిస్తారా!" అనడిగాడు.

"మొద్దురుగాని రండి" అంటూ గదులు చూపించి 'ఇది బెడ్‌రూమ్' అంటూ ఒక గది తలుపు తీసింది.

ఆమెపక్కనుంచి లోపలికివెడుతూ కావాలని ఆమెకు రాసుకుంటూ వెళ్లాడు! కనీసం తప్పుకోనయినాలేదు.

అతనిలో రక్తం పరవళ్ళుతొక్కింది. ఆమె నడుంచుట్టూ చేయివేశాడు. అంతే—అతని చేతిలో వాలిపోయింది!

* * *

రోజూ కోర్టులో కనబడి, సాయంత్రం నాలుగింటికల్లా నేరుగా రేఖాదేవియింటికి వెళ్ళిపోవటం అక్కడ గడిపి భోజనంవేళకి ఇంటికి చేరుకోవటం అతని కార్యక్రమం అయింది. బయటి ప్రపంచంవంక చూసేందుకయినా వ్యవధి చిక్కటంలేదు. రేఖాదేవి అందం అతన్ని మత్తులో ముంచేస్తోంది.

ఒకరోజు—

"ఇంత అందం నాకోసం దాచివుంచారా రేఖా" నుదుటిమీద పడిన ముంగురులతో ఆడుకుంటూ అన్నాడు చలపతి.

"ఊఁ" అంది మత్తుగా రేఖాదేవి.

"ఒక్కవిషయం అడుగుతాను కోపంరాదు కదా!"

"కోపం దేనికి?"

"నీ కసలు పెండ్లి కాలేదా?"

"అయింది....ఎందుకు?"

"మరి....మరి....ఆయనెక్కడుంటాడు?"

"మా ఊళ్ళో వ్యవసాయంచేయిస్తున్నాడు" అంది నిర్లక్ష్యంగా.

"మరి నిన్ను—నన్ను ఇలా చూస్తే?"

"ఆయనకి తెలుసుగా — చేతకానివాడు తెలిసిమట్టుకు ఏం చేయగలడు?" అంది నవ్వుతూ.

చలపతికి ఆవిడమాటలు అర్థంకాలేదు. 'అంటే?' అన్నాడు.

"అంటే చిన్నతనంలో యిష్టంవచ్చినట్టు చెడుతిరుగుళ్ళు తిరిగాడు ఆయన. పెండ్లి అయేప్పటికి అయ్యగారిశక్తి ఉడిగిపోయింది. వేరే గత్యంతరంలేక నేను ఇలా ఉంటున్నానని తెలిసికూడా ఏమనడు .... అసలు ఉన్న ఊళ్ళో అల్లరి అయితే బావుండదని ఆయనే నన్నిక్కడికి పంపించింది!"

ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు చలపతి. తను మటుకు చెడుతిరుగుళ్ళు తిరగటంలేదూ? అయితే దాని ఫలితం—మెరుపులా ఒక ఆలోచన కలిగింది.

"ఇంకొకమాట అడుగుతాను!"

''ఎందుకు బంగారంలాంటి టైము వృథా చేస్తావు. అయినా ఈ సందేహాలు ఎందుకొచ్చాయి నీ కివ్వాళ'' అంది గోముగా.

''సత్యం ఆదేప్లీడరు సత్యంని ఎరుగుదువా'' ఫక్కున నవ్వింది. 'సరి! అతనేగా నిన్ను గురించి నాకు చెప్పింది. మా యిద్దరి పరిచయం ఈనాటిది కాదులే!' అంటూ మెడకు చేతులువేసి 'మనిద్దరి పరిచయానికి ప్రయత్నించింది అతనే పాపం!' అంది.

ఇదివరకు అలా చేస్తే కరిగిపోయేవాడు చలపతి.

''సత్యం రేఖాదేవిని ఎరుగుండి, దాంతో చాలాకాలం ఉండి, తన విషయం ఆవిడకి చెప్పికూడా — ఏమీ ఎరగనట్టు మంచివని చెప్పటంలో అర్థం ఏమిటి?'' అని ఆలోచించాడు.

మరుక్షణంలో కలిగిన ఆలోచనవలన మనిషి తెల్లపోయాడు. వెంటనే లేచి నిలబడి రేఖాదేవి బ్రతిమాలుతున్నా వినకుండా ఇంటికి బయలుదేరాడు. తలలో రకరకాల ఆలోచనలతో ఒళ్ళు వేడెక్కిపోయింది.

ఇంటితలుపులు వేసివున్నాయి. కిటికీలు కూడా మూసివున్నాయి. చప్పుడుచేయకుండా సందులోకి వెళ్ళాడు.

మెల్లిగా మాటలు వినబడుతున్నాయి.

''మొత్తంమీద మా ఆయన్ని భలే దెబ్బ తినిపించావు. ఆ రేఖాదేవి మాయలోపడి యిప్పట్లో మనవిషయం పట్టించుకోరు. ఎంతసేపు తన రహస్యం బయటపడకుండా తాపత్రయపడుతున్నాడు పాపం!'' అంది కిల కిల నవ్వి.

అది కమలగొంతు.

''మరేమి టనుకున్నావు సత్యం తడాకా అంటే! ఒక పందెం వేయించాను వాడిచేత. రేఖకి చెప్పివుంచాను వీడివిషయం. అంతే అదొక సాలెడుగూడు. ఇప్పట్లో మనకి భయం లేదు!''

చలపతికి తలతిరిగిపోయింది. తలుపులు పగలకొట్టి ఇద్దరిని ఒక్కదెబ్బతో చంపుదామనుకుని తర్వాత తమాయించుకున్నాడు.

ముంచుకొస్తున్న చీకట్లలో స్టేషనుకేసి నడిచిపోయాడు.

తను అన్నమాటలు తనభార్యమీదే సత్యం ఆచరణలో పెడుతున్నాడన్న నిజం అతనికి అప్పట్లో స్ఫురించలేదు. ★